# పేరు మీరే పెట్టండి

**అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.**

క్రోతి బస్‌స్టాప్ దగ్గర నుంచుని మాలాలి వెళ్ళేబస్ కోసం ఎదురు చూస్తున్నాడు అభిషేక్. బస్ ఆలస్యమయితే, తోటిప్రయాణీకుల ముఖాలవంక పరిశీలనగా చూస్తూ వారి ప్రవర్తనలను అంచనా వేయడం అతని హాబీ. ఇంతలో ఓ పదేళ్ళ అబ్బాయ్ చేతిలో ఒక పచ్చని కార్డు చూపిస్తూ డబ్బులు అడుక్కోడం అతని కంట పడింది. కొందరు కార్డు చదివి 'పాపం' అని జాలిపడుకూ పదో, ఇరవయ్యో పైసలు ఇస్తున్నారు ఇంకొందరు "బస్ రాక మేం ఛస్తుంటే నీదో వెధవగోల పోవయ్యా!" అంటూ విసుక్కుంటున్నారు. వాడు మెల్లగా అభిషేక్ దగ్గరకొచ్చి కార్డు అందించాడు. వాడికి మాటలు రావని, అమ్మానాన్న ఎవరూ లేరని, తోచినంత దానం చేసిపుణ్యం కట్టుకోమని కార్డులోవుంది. "నీకు మాటలురావా?" అభిషేక్ అడిగాడు. రావన్నట్టు తలూపాడు అడ్డంగా.

అభిషేక్ జేబులోంచి ఓ ఒక రూపాయి కాగితం తీసి వాడి చేతులో పుంచుతూ, "ఊరికే పాపం ఎంతమంది నడుక్కుంటావ్! ఈ పదిరూపాయలతో 'ఇవ్వాల్టికి సరిపెట్టుకో!" జాలిగా అన్నాడు, అంతే—

"సార్! ఒక్క రూపాయి కాయితం ఇది" చెప్పి నాలిక్కరుచుకున్నాడు ముష్టిపిల్లాడు-

"అదే నాక్కావాల్సింది! మాటలు రావని మోసం చేస్తావా? దొంగ వెధవ!" అంటూ ఇచ్చిన రూపాయి కూడా లాగేసుకున్నాడు అభిషేక్. *

—బి. రఘురామరాజు
(మహబూబ్‌నగర్)

*స్రవంతి నెం. 10లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత శ్రీ గోపరాజు రాధాకృష్ణ పెట్టిన పేరు: పాపం ..కర్ణుడు.*

*ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ :*



-శ్రీమతి **అరణి**

ఓ కథ రాయండి శీర్షికన వచ్చిన కథలన్నిటా 'తెర వెనుక', 'నే.చ.పె.చూ.సి.చే' మెరుగయినవి అన్పించి, ఈరెంటినీ ఎన్నిక చేయడం జరిగింది. 'ఎ షార్ట్ స్టోరీ డీల్స్ విత్ ఎ సింగిల్ సిట్యుయేషన్' అన్నది ఒకనాటి కథకి నిర్వచనమయితే స్రవంతి ఆ నిర్వచనాన్ని ఈ శీర్షికతో 'ఎ షార్ట్ స్టోరీ డీల్స్ విత్ ఎ సింగిల్ డైలాగ్' గా మార్చ గలిగింది. అందుకు ఈ పత్రికను అభినందిస్తున్నాను.

సాహిత్యంలో కథానిక ప్రక్రియను నేను బాగా అభిమానిస్తాను. కథల్ని రాయడం కన్నా చదవడమంటే నాకు భలే ఇష్టం.

—అరణి

## తెర వెనుక

ఢిల్లీలో జాతీయ స్థాయిలో పోలీసు ఉద్యోగుల నాటక పోటీలు జరుగుతున్నాయి. కానిస్టేబుల్ స్థాయి నుండి కమీషనర్‌ల వరకూ ఆ నాటకాలలో పాల్గొంటున్నారు.

అంతకు ముందే జాతీయ స్థాయిలో రెండు సార్లు 'ఉత్తమ నటుడు'గా ఎన్నికైన కానిస్టేబుల్ సుబ్బారావు, స్వయంగా రాసి, దర్శకత్వం వహిస్తూ, అందులో ముఖ్య పాత్రను కూడా వేస్తుండటంతో, ఆ నాటకాన్ని చూడ్డానికి ప్రేక్షకులు విరగబడ్డారు.

నాటకం మొదలయింది. సీన్లు చకచకా సాగిపోతున్నాయి. క్లయిమాక్స్‌లో సుబ్బారావు 'ట్రాజెడీ' సీనుకు జీవం పోస్తున్నాడు. తాగి తాగి చివరికి చనిపోయే పాత్ర అది.

సీను ప్రకారం తాగుతూ, డైలాగ్స్ చెబుతూ, గుండెల్లో నొప్పిని అభినయిస్తూ నేలకొరిగి పోయాడు సుబ్బారావు. నాటకం అయిపోయినట్టు 'తెర' జారింది. మరు నిముషంలోనే కలకలం మొదలైంది. తెర వెనుక. కింపడిన సుబ్బారావు తిరిగి లేవలేదు. 'పాత్రలో లీనమై నటించటంతో 'హెమరేజ్' రావటం వల్ల మరణించి ఉంటాడు' అని నిర్ధారించారు సహ నటులు. ఆ మహానటుని ఆకస్మిక మరణంతో దిగ్భ్రాంతి చెందిన జనం అతణ్ణి చివరి చూపుగా చూసి 'నివాళి' అర్పించేందుకు తొక్కిసలాడుకుంటున్నారు.

సుబ్బారావు దేహంపై పడి దారుణంగా, గుండెలవిసేలా ఏడుస్తున్నాడు సబిన్స్పెక్టర్ శ్రీనివాస్. నాటకం క్లయిమాక్స్‌లో ఇద్దరూ కలిసి నటించాల్సి ఉంది. ఆ సీన్‌కి ముందు "గ్రీన్‌రూం"లోకి పిలిచి సుబ్బారావు అన్న మాటలు అతన్ని నిలువునా దహించేస్తున్నాయి.

"సార్...దయచేసి ఈ విషయం ఎవరితోనూ చెప్పకండి." ప్రమాణం చేయించుకున్నాడు సుబ్బారావు.

"క్రీడారంగంలో జాతీయ స్థాయిలో బహుమతి సంపాదిస్తే, వేలరూపాయల బహుమతులూ, ఉద్యోగాల్లో ప్రమోషన్లు ఇస్తుంది మన డిపార్ట్‌మెంట్. కానీ, ముప్పయ్ అయిదేళ్ళ నా జీవితాన్ని ఈ వృత్తికే అంకితం చేసి, నాటకరంగంలో రెండుసార్లు జాతీయస్థాయిలో ఉత్తమ నటుడిగాబహుమతి పొందినా, రెండుసార్లకీకలిసి వెయ్యి రూపాయలు నగదు తప్ప, నాకింకే ప్రోత్సాహమూ లభించలేదు....సార్... క్రీడారంగం కంటే ఏం తీసిపోయింది సార్...కళారంగం!! దేని గొప్ప దానిదే సార్!" క్షణం ఆగాడు సుబ్బారావు.